Corpor
227 (N
and
Bar
Pl

Date 5-1-1988

# కరువు రైతుకు కనక వర్షం

## గణేష్ దానిమ్మ సాగు



దేశంలోని మహారాష్ట్రలో రైతుల నుంచి మంచి ఆదరణ పొంది గణేష్ రకం దానిమ్మ (విత్తనాలు లేని) రకాన్ని అనంతపురం రైతులకు అందజేయడంలో జిల్లాలోని ద్రాక్ష తోటల సలహాదారు శ్రీ సుధాకర రావు విశేష కృషి చేసారు. ఈ రకం దానిమ్మ సాగు వర్షాభావం పూర్తిగా ఉన్న అనంతపురం జిల్లా వంటి ప్రాంతాల్లో రైతులకు వరప్రసాదంగాలాంటిదిగా శ్రీ సుధాకరరావు తన పరిశోధనల్లో తెల్సుకొని ఈ జిల్లాలో గణేశ్ దానిమ్మ పంటను మూడేళ్ల క్రితం కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రైతులను ప్రోత్సహించారు. అందులో ఆయన కొందరు ఔత్సాహిక రైతులను మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలోని దానిమ్మ పంటవేసే తోటలకు స్వయంగా తీసుకుని వెళ్లి అక్కడి సాగు విధానాన్ని వారికి విశదం చేసి ప్రత్యక్షంగా అక్కడి రైతుల స్వీయ అనుభవాలను వారికి తెలియజేయడం జరిగింది. తర్వాత అక్కడ నుండే గణేశ్ దానిమ్మ అంటును తీసుకొని వచ్చి అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా కొద్ది పాటి విస్తీర్ణంలో నాటిని సాగు చేశారు. ఆ పంట ఇక్కడి వాతావరణానికి పూర్తిగా సరిపడి లాభదాయకంగా ఉండడంతో ప్రస్తుతం జిల్లాలోని పలుచోట్ల రైతులు గణేశ్ దానిమ్మ సాగుపై ప్రత్యేకంగా శ్రద్ధ కనపరుస్తున్నారని శ్రీ సుధాకర రావు ఒలిమ్యాన్ ప్రతినిధికి తెలిపారు.

ఒక హెక్టారుకు గణేశ్ దానిమ్మ వెయ్యి మొక్కలు నాటడానికి అనువుగా ఉంటుంది. దీనికి పరిమితమైన ఎరువుల, సస్యరక్షణ మందులు మొదలైన సాగుదల ఖర్చులు హెక్టారుకు దాదాపు 35 వేలు దాకా అవుతుందని పదిహేను నెలల కాలంలో గణేశ్ దానిమ్మ పంటకు వస్తుందని గణేశ్ దానిమ్మ తోటను వేసిన ఔత్సాహిక రైతు శ్రీ గొంది పాండు రంగయ్య తెలిపారు. ఆయన ఇటీవల ఎస్.కె. యు విశ్వవిద్యాలయం దగ్గరగల తనతోటలో పంట సాగు విషయం వివరించారు. 15 నెలలకే పంట చేతికందుతుందని తర్వాత ప్రతి సంవత్సరం రెండు పంటలు చేతి కందగలవని ఆయన వెల్లడించారు.

మొదటి పంటకు సుమారు 60వేల రూపాయల మేరకువస్తుందని ఆశిస్తున్నామని, లక్ష రూపాయల దాకా వచ్చే అవకాశం ఉన్నదని శ్రీ పాండురంగయ్య తెలిపారు. ఆయన తన తోటలోని ఒక బావిలో కొద్దిపాటి నీటి వనరులు ఉన్నాయని అయితే పంట సాగుకు ఆ నీరు సరిపోతోందని వర్షం రాకపోయినా ఫరవాలేదని ఫలసాయం మాత్రం దిగుబడి తగ్గకుండా ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇతర పంటల మాదిరిగా ఎరువులు, సస్యరక్షణ మందులు ఎక్కువగా వాడనవసరంలేకుండా అధిక దిగుబడిని ఇచ్చే గణేశ్ దానిమ్మను జిల్లాలోని రైతులు బాగా ప్రోత్సహించితే ఈ వర్షాభావ కరువు పరిస్థితులను తట్టుకొని రైతు నిలబడగలడని ఔత్సాహిక గణేశ్ దానిమ్మ రైతు శ్రీ పాండు రంగయ్య వెల్లడించారు.

కొద్దిపాటి శ్రద్ధ తీసుకుంటే దానిమ్మ పండు మంచి రంగు కలిగి మధురంగా ఉండగలదని, తన తోటలోనే ఆ విధమైన మంచి నాణ్యత గల పండ్లను సాధించగలిగానని ఆయన తెలిపారు.

గణేశ్ దానిమ్మకు మార్కెటింగ్ సమస్య లేదని ఇక్కడ నుండి బెంగుళూరు, మద్రాసు, బొంబాయి, ఢిల్లీ, కలకత్తావంటి ప్రాంతాలకు దీన్ని పంపి మంచి గిట్టుబాటు రేటును రైతులు పొందే అవకాశాలకు వీలున్నదని శ్రీ పాండురంగయ్య తన అనుభవాన్ని తెలిపారు. జిల్లాలోని దానిమ్మ పంటల విధానంలో "తాను ద్రాక్ష, దానిమ్మ తోటల పెంపకంలో నిపుణుడు, సలహాదారు అయిన శ్రీ సుధాకరరావు సూచనలను , సలహాలను పాటించడం జరుగుతోందని, ఆ సలహాలు తనకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయని ఆయన అన్నారు.

కరువుపరిస్థితుల్లో అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా రైతాంగం గణేశ్ దానిమ్మ పంటను సాగుచేసి సత్ఫలితాలను పొందాలని శ్రీ సుధాకరరావు జిల్లా రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పంటను సాగుచేయదల్చుకున్న రైతులు స్వయంగా అనంతపురం సమీపంలో ఉన్న గణేశ్ దానిమ్మతోటలను చూసి ఆ రైతుల అనుభవాలను తెల్సుకొని ప్రయోజనం పొందవచ్చునని కూడా శ్రీ సుధాకర రావు తెలిపారు.

ఇంగువ వెంకటేశ్వరరావు